క్లుప్తంగా

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



మట్టిని సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కౌతాళం: మట్టి నమునాలతో భూసారాన్ని తెలుసుకుని ఫలితాల ఆధారంగా తగిన మోతాదుల్లో ఎరువులు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చు అని మండల వ్యవసాయాధికారి శేషాద్రి అన్నారు. ఆదివారం మండలంలోని కుంటనహాల్ గ్రామంలో వ్యవసాయ సిబ్బంది ఈశ్వర్‌నాయక్, వీఆర్‌ఏ తాయప్ప రైతుల పొలాల్లో భూసార పరీక్షల కోసం మట్టిని సేకరించారు. ప్రభుత్వం ఉచితంగా చేస్తున్న ఈ మట్టి పరిక్షల కోసం ముందుకు రావాలని ఆయన కోరారు.

పెంచిన బిల్లులను తగ్గించాలి

ఆదోని రూరల్: పెంచిన విద్యుత్ బిల్లులను వెంటనే తగ్గించాలని సీపీఎం సీనియర్ నాయకుడు మహానందిరెడ్డి, సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ నాయకులు గోపాల్, తిప్పన్న, వీరేష్, నాగరాజు, వెంకటేష్ కోరారు. ఆదివారం కరెంట్ బిల్లుల పెరుగుదలపై కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కరెంట్ బిల్లులు పెంచడంతో పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

నేటి నుంచి ఆషాడమాస వారాలు



ప్రత్యేక అలంకరణలో రేణుకాలయల్లమ్మ

ఆదోని అర్బన్ : పట్టణ శివారులోని యల్లమ్మవ్వకొండలో వెలిసిన శ్రీ రేణుకాయల్లమ్మవ్వ ఆషాడమాస వారాలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మోహన్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. మొదటివారం 20వ తేదీన, రెండో వారం 27న, మూడో వారం జూలై 4న గంప జాతర, 11న జాతర మహోత్సవాలు ఉంటాయని చెప్పారు. ఆయా రోజుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలి



విద్యార్థులకు పురస్కారాలు అందజేసిన దృశ్యం

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంఈఓ బి.శివరాములు తెలిపారు.డివిజన్‌లోని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక వాగ్దేవి ప్రాథమిక పాఠశాల అవరణలో శ్రీ మహర్షి వాల్మీకి ప్రతిభా పురస్కారాల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆదోని, ఆలూరు, మంత్రాలయం మండలాల్లో పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఇంగళదహాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, డాక్టర్ కె.అర్.స్వామి, సంఘాల నాయకులు రమేష్‌నాయుడు, నరసప్ప, సత్యన్న పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



రాయచూర్ ఎమ్మెల్యేను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలోని తుంగభద్ర నది ఒడ్డున వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్రం రాయచూర్ రూరల్ ఎమ్మెల్యే దద్దల బసన్న గౌడ్ వచ్చారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని కులదైవం రామలింగేశ్వర స్వామి దర్శించుకుని పూజలు చేశారు. ఆయనను వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు మాజీ ఎంపీటీసీ రమేష్ తదితరులు కలిశారు.

ఎంఈఓల నియామకం

ఆదోని సెంట్రల్: ఆదోని ఎంఈఓ– 2 గా పి.శ్రీనివాసులును నియమిస్తూ డీఈఓ రంగారెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసులు ఆదోని మండలం మండిగిరి గ్రామ పంచాయితీ పరిధిలోని అర్‌జీ నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ప్రతి మండలములో ఇద్దరు ఎంఈఓలు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో విద్యాధికారి పోస్టులకు కౌన్సెలింగ్ జరిగింది.



కె.నాగేశప్ప

కోసిగి: ఎంఈఓగా కె.నాగేశప్పను నియమిస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆయన ఆదోని మండలం విరుపాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ పదోన్నతిపై కోసిగి ఎంఈఓగా నియమింపబడ్డారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ మొయినుద్దీన్ మంత్రాలయం మండలానికి రెగ్యులర్ ఎంఈఓగా కొనసాగనున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

- ఏప్రిల్, మే, జూన్ నెలల్లోనే అధికంగా వాడకం
- నెలకు 1.1 మిలియన్ యూనిట్లు పెరుగుదల
- గతేడాది మే నెలలో 57.67 మిలియన్ యూనిట్లు ఖర్చు
- ఈ ఏడాది నెలకు 76 మిలియన్ యూనిట్లు
- పెరిగిన ఎండలతో ఆగకుండా తిరుగుతున్న ఏసీలు, ఫ్యాన్‌లు,ఫ్రిడ్జ్‌లు
- బిల్లులు పెరుగుతున్నా లెక్కచేయని జనం

జూన్ నెల మూడో వారం గడుస్తున్నా భానుడు సుర్రుమంటున్నాడు. మే నెలను తలపిస్తున్న ఎండలు, వడగాడ్పులతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్లల్లో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీ ఆగకుండా తిరుగుతున్నా ఉక్కపోతను భరించలేకపోతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరిగింది. అయినా వినియోగదారుల డిమాండ్‌కు తగ్గట్లు ప్రభుత్వం నిరంతరాయంగా సరఫరా చేస్తుంది. గతేడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రోజుకు 2.88 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడగా ఈ ఏడాది 3.77 మిలియన్లకు పెరిగింది. వరుణుడు కరుణిస్తే కొంత వరకు వినియోగం తగ్గే అవకాశముంది.



పట్టణంలోని ఎంఎం కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్

ఆదోని అర్బన్ : ఒకవైపు మండుతున్న ఎండలు.. పెరుగుతున్న విద్యుత్ వినియోగం.. మరోవైపు అకాల వర్షం, ఉరుములు, ఈదురుగాలులు, పిడుగులు, నేలకొరుగుతున్న విద్యుత్ స్తంభాలు.. ఇలా ఎంత ఒత్తిడి ఉన్నా మెరుగైన సేవలు అందించేలా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా చేస్తున్నారు. గతేడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ప్రతిరోజూ 2.88 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం ఉండగా, ప్రస్తుతం 3.77 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఎక్కడైనా సరఫరాలో అవాంతరాలు ఎదురైనా తక్షణం స్పందించి ప్రజల ఇబ్బందులు తొలగిస్తూ, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు. పట్టణంలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. ఆగస్టు నుంచి ఏప్రిల్ వరకు పత్తి, వేరుశనగ కాయల సీజన్ ప్రారంభమవుతుంది. ఎండాకాలంలో పరిశ్రమల వినియోగానికి ప్రజల వాడకం సమానంగా ఉంటుంది.

గతంలో నిత్యం కోతలే..

గతంలో వేసవి కాలం వచ్చిందంటే విద్యుత్ కోతలు తప్పేవి కాదు. ఏదైనా విపత్తు వచ్చినా గంటల తరబడి కరెంట్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడాల్సిందే. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వేసవిలో సైతం నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ఎండలు మండిపోతూ అమాంతం విద్యుత్ వినియోగం పెరిగినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా గృహాలకు, వ్యవసాయానికి, పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నారు. గత యేడాది కంటే ఈ యేడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయి. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 2.88 మిలియన్ యూనిట్ల నుంచి 3.77 మిలియన్ యూనిట్లకు వాడకం పెరిగింది. ఈ వేసవిలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత సాధారణంగా మారిపోయింది. రాత్రి పూట 30 డిగ్రీలకు దాదాపు తగ్గలేదు. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్‌ల వినియోగం ఎక్కువైంది. ఒక్కసారిగా రోజుకు 1.1 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం పెరిగింది. ఇలాంటి సందర్భంలో కూడా కోతలు లేకుండా కరెంట్ సరఫరా చేస్తున్నారు. గతేడాది ఏప్రిల్‌లో67.38 మిలియన్ యూనిట్లు, మే నెలలో 57.67 మిలియన్ యూనిట్లు, జూన్ నెలలో నెలకు 60.80 మిలియన్ల యూనిట్ల చొప్పున వాడకం ఉండేది. ఈ యేడాది ఏప్రిల్‌లో 69.5 మిలియన్ యూనిట్లు, మే లో 76.6 మిలియన్ యూనిట్లు వాడేశారు.

బిల్లులూ పెరిగాయి..

రెండు ఫ్యాన్‌లు, ఒక ఏసీ, మూడు ట్యూబ్‌లైట్లు ఉన్న ఒక ఎగువ మధ్యతరగతి కుటుంబ విద్యుత్ వినియోగం ఏప్రిల్ నెలలో సగటున 185 యూనిట్లు నమోదై రూ.800 బిల్లు చెల్లించాల్సి వచ్చింది. మే నెలలో అదే తరహాలో కుటుంబాలు 300 యూనిట్లు దాటిపోయి రూ.1,500 బిల్లు చెల్లించాల్సి వచ్చింది. ఇలా ప్రతి కుటుంబంలో స్థాయిని బట్టి వినియోగం పెరిగింది. గతేడాదితో పోలిస్తే ఈ యేడాది విద్యుత్ వాడకం బాగా పెరిగింది.

పరిశ్రమలకు సమానంగా వాడకం..

పట్టణంలో కాటన్ జిన్నింగ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలు, వేరుశనగ డిగార్‌గేట్ ఫ్యాక్టరీలు, ఆయిల్ మిల్లులు తదితర చిన్నచిన్న పరిశ్రమలు వందకు పైగా ఉన్నాయి. పెద్దపెద్ద పరిశ్రమలైన పత్తి, ఆయిల్ ఫ్యాక్టరీలు, జీఎస్ డిగార్ గేటర్‌లకు సీజన్ ఆగస్టు నుంచి మార్చి వరకు ఉంటుంది. ఆ నెలల్లో విద్యుత్ వాడకం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో ఎంత వాడకం ఉంటుందో వేసవి కాలంలో ప్రజలు అంతే విద్యుత్‌ను వాడేస్తున్నారు. గతేడాది ఆగస్టు నెలలో 70 మిలియన్ యూనిట్ల నుంచి ప్రారంభమై 87 మిలియన్ యూనిట్ల వరకు పరిశ్రమలు వాడేశాయి. పరిశ్రమలలో సీజన్ లేనప్పుడు, వేసవి కాలం కాని సమయంలో నెలకు 57.67 మిలియన్ యూనిట్లు వాడారు. డివిజన్ పరిధిలో 3.90 లక్షలు గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అలాగే వ్యవసాయ కనెక్షన్లు 70 వేలు, పరిశ్రమల కనెక్షన్లు 740 ఉన్నాయి. మొత్తం 32,471 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి.

సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



వేసవి దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరిగినప్పటికీ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. అత్యవసర మరమ్మతులు, లైన్లలో నిర్వహణ లోపాలు తలెత్తినప్పుడు అంతరాయం ఏర్పడుతుంది. 24 గంటలు విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేదు. ప్రజలు విద్యుత్‌ను ఆదా చేయాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో, ఇళ్లల్లో బయటికి వెళ్లినప్పుడు ఏసీ, కూలర్లు, లైట్లు, ఫ్యాన్‌లు ఆఫ్ చేయాలి. గతంలో కంటే ఈ వేసవి కాలంలో విద్యుత్ వాడకం గణనీయంగా పెరిగింది.

– సుధాకర్‌కుమార్, విద్యుత్‌శాఖ డీఈ

ఘనంగా మట్టి ఎద్దుల పండుగ



మట్టి ఎద్దులను ఊరేగిస్తున్న చిన్నారులు



కౌతాళంలో మట్టి ఎద్దుల్ని ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కోసిగి: మండల కేంద్రంలో మట్టి ఎద్దుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదివారం మట్టి ఎద్దుల అమావాస్యను పురస్కరించుకుని గ్రామ దేవతలకు పూజలు చేశారు. చిన్నారులు కుమ్మరి వీధికి వెళ్లి మట్టి ఎద్దులను కొనుగోలు చేసి ఇంటికి తెచ్చుకుని వాటికి రంగులతో ముస్తాబు చేసి పూజలు చేశారు. కడపాళెం వీధిలో చింతలగేని, కాశమ్మ గడ్డ, నాడుగేని వీధి, నాగన్న గేరి, ఊరువాకిలిలో చిన్నారులు కలశాలతో మట్టి ఎద్దులను ఊరేగింపుగా ఆంజనేయ స్వామి దేవాలయం వరకు వెళ్లి పూజలు చేశారు.

కౌతాళం: మండలంలో ఆదివారం మట్టి ఎద్దుల అమావాస్య (జేష్ట అమావాస్య) వేడుకల్ని వైభవంగా నిర్వహించారు. మట్టితో తయారు చేసిన ఎద్దుల్ని గ్రామ వీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. ప్రత్యేక పూజల అనంతరం మట్టి ఎద్దుల్ని ఎద్దుల బండ్ల మీద, పల్లకీలో ఊరేగించారు. స్థానిక హనుమన్‌నగర్‌లో, కామవరం, లింగాలదిన్నె, నదిచాగి గ్రామాల్లో వేడుకల్ని రైతులు ఘనంగా జరుపుకున్నారు.

మల్లన్నసేవలో ఆదోని ఎమ్మెల్యే



ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆదివారం సాయంత్రం మల్లన్న దర్శనార్థం విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆశీర్వచన మండపంలో ఎమ్మెల్యేకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

పల్లెల్లో ప్రశాంతంగా జీవించాలి



కపటి గ్రామంలో పర్యటిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని రూరల్ : పల్లెల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. ఆదివారం మండలంలోని కపటి గ్రామంలో ఇసీ్స ఎస్‌ఐ చిన్నపీరయ్యతో కలిసి పర్యటించారు. ముందుగా గ్రామస్తులతో సమావేశమయ్యారు. బాల్య వివాహాలు, పోలీసు సేవలు, సైబర్ క్రైమ్స్ తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో పిల్లల జీవితాలు బుగ్గిపాలవుతాయన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని, పిల్లలను బాగా చదివించాలని కోరారు. కలిసిమెలిసి జీవించాలని, వ్యక్తిగత కక్షలకు పోయి ఆర్థికంగా, మానసికంగా నష్టపోవద్దని చెప్పారు. అనంతరం గ్రామంలో కవాతు నిర్వహించి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పిల్లలను బాగా చదివించండి..

మంత్రాలయం: పల్లెల్లో గొడవలకు పోకుండా పిల్లలను బాగా చదివించాలని మంత్రాలయం ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు సూచించారు. మండలంలోని బూదూరు గ్రామంలో ఆదివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వ్యక్తుల మధ్య ఘర్షణ జరిగితే కులాలకు, మతాలకు ముడిపెట్టరాదని, సోదరభావంతో, కలిసిమెలసి మెలగాలన్నారు. మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం దిశ యాప్‌ను తీసుకొచ్చిందని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు వివరాలు అడిగితే చెప్పరాదని, అనుమానితులు గ్రామాల్లో తిరుగుతుంటే డయల్ 100కి లేదా, 9121101152 కానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉరుకుంద రోడ్డులో ట్రాఫిక్ జామ్

- ట్రాఫిక్ స్తంభించి రెండు గంటల పాటు నిలిచిపోయిన వాహనాలు
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు



ట్రాఫిక్‌లో నిలియిన వాహనాలు

కోసిగి: మండలంలోని జుమ్మాలదిన్నె గ్రామం నుంచి ఉరుకుంద గ్రామం వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో దాదాపు రెండు గంటల పాటు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఆదివారం అమావాస్య కావడంతో జిల్లా నలుమూల నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం తరలివచ్చారు. వాహనాలు కోసిగి మీదుగా జుమ్మలాదిన్నె, ఉరుకుంద గ్రామం వరకు 10 కి.మీ. దూరం ఉంది. అయితే కోసిగి –ఉరుకుంద వరకు సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే ఇబ్బందుల పడాల్సి వస్తోంది. ఆదివారం దయం 11 గంటల నుంచి జుమ్మలదిన్నె గ్రామ సమీపంలో భారీగా వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి. ఎక్కడి వాహనాలు అక్కడే ఉండి ట్రాఫిక్ క్లియర్ చేసే వారు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరికొందరు వాహనాలు, దిగి పోలాల వెంబడి నడిచి వెళ్లాల్సి వచ్చింది.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



చిన్నారి తనుశ్రీని ఓదారుస్తున్న స్థానికుడు రవి

ఆదోని టౌన్ : పట్టణంలోని గోళీపేటకు చెందిన ప్రకాష్ కుమార్తె మూడేళ్ల చిన్నారి తనుశ్రీ ఆదివారం ఇంటి ముందు ఆటలాడుకుంటూ తోటి పిల్లలతో కలిసి ఎమ్మిగనూరు రోడ్డులోని రిలయన్స్ ట్రెండ్స్ షాపు వద్దకు చేరుకుంది. దీంతో ఇంటి నుంచి తప్పిపోవడంతో ఏడుస్తున్న పాపను గమనించిన స్థానికులు రవి, మరికొందరు ఓదార్చి వివరాలు తెలుసుకుని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. విచారించిన పోలీసులు గోళీపేటలోని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పాపను అక్కున చేర్చుకున్న తల్లిదండ్రులు పోలీసులకు, స్థానికులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైభవంగా రథోత్సవం

ఆస్పరి: మండలంలోని ములుగుందంలో సమాధి అయిన అవధూత శ్రీశైలం తాత (తిక్క శంకరయ్య తాత) 12వ ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మందిరంలో తాత సమాధికి గంగ, ఆకు పూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తాత విగ్రహం, సమాధికి పూజలు చేసి దర్శించుకున్నారు. శ్రీశైలం తాత నామసస్మరణతో భక్తులు రథాన్ని లాగారు. మండలంలోని గ్రామాల నుంచే కాకుండా శ్రీశైలం, విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా సింధగి తాలూకా ఆల్‌వేల్ గ్రామం నుంచి వచ్చిన తాత కుటుంబ సభ్యులు పూజలు చేసి దర్శించుకున్నారు.

రూ.14 లక్షలతో ముఖద్వారం నిర్మాణం

ములుగుందంలో వెలసిన శ్రీశైలం తాత ఆలయ ముఖద్వారాన్ని రూ.14 లక్షలతో నిర్మించారు. భక్తులు, దాతలు, గ్రామస్తుల సహకారంతో ముఖద్వారం నిర్మాణం పూర్తి చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. తాత ఆరాధనోత్సవాల సందర్భంగా ముఖద్వారానికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



ములుగుందంలో శ్రీశైలం తాత రథాన్ని లాగుతన్న భక్తులు

శ్రీ మఠంలో అమావాస్య పూజలు



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో మూల బృందావనం.

మంత్రాలయం : శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం అమావాస్య పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో మఠం పరిసరాలు రద్దీగా మారాయి. పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి వేకువజామునుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు రథాలపై ఊరేగించారు.

ఉరుకుందలో భక్తుల సందడి



వెండి అలంకరణలో స్వామి వారు



స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి దర్శనానికి ఆదివారం అమావాస్య కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో దేవాలయ పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో పోటెత్తాయి. స్వామి దర్శనం కోసం గంటకుపైగా సమయం పట్టింది. ఆదివారం తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు ఆకు పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఏర్పాట్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ పర్యవేక్షించారు. మేళిగనూరులో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వర దేవాలయం, సుళేకేరి గ్రామ శివారుల్లో వెలిసిన బుడుములదొడ్డి ఆంజినేయస్వామి దేవాలయం భక్తులతో పోటెత్తింది.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఆదివారం అమావాస్య పూజలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం అమావాస్య కలిసి రావడంతో భక్తులు తరలివచ్చి ఫాతెహాలు నిర్వహించారు. కొందరు భక్తులు పిండి వంటలు వండి స్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తరలిరావడంతో దర్గా పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ.. స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాల అనంతరం భక్తుల్ని దర్శనానికి అనుమతించారు.

ఏఐటీయూసీ కార్యవర్గం ఎన్నిక

ఆదోని రూరల్ : సీపీఐ అనుబంధ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆదోని పట్టణ ప్రధాన కార్యదర్శిగా బి.వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని రెవెన్యూ భవన్‌లో సంఘం జనరల్ బాడీ సమావేశం ఒ.బి. నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, జిల్లా అధ్యక్షుడు కె.అజయ్‌బాబు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గిడ్డయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శిగా బి.వెంకన్న, అధ్యక్షుడిగా వై.టి.భీమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వీఓఏల నూతన కమిటీ ఎన్నిక

కోసిగి: మండల వైఎస్సార్ క్రాంతి పథకం వీఓఏల యూనియన్ నూతన కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బసవరాజు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక బీరప్ప ఆలయ ప్రాంగణంలో మండల వీఓఏల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడుగా ప్రకాష్, కార్యదర్శి రుద్రముని, కోశాధికారి జయమ్మతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, గౌరవ అధ్యక్షుడు మద్దిలేటి, సలమాదారు రామలింగప్ప, సహాయ కార్యదర్శి భాస్కర్ నాయుడు, వీఓఏలు పాల్గొన్నారు.

పార్కుల్లో పరికరాల ఏర్పాటు

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 15 పార్కుల్లో వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటీజన్లు, చిన్నపిల్లల కోసం అవసరమైన కుర్చీలు, బెంచీలు, ఆట వస్తువులను ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎన్‌జీవోస్ కాలనీలోని రెండు పార్కులతో పాటు చిన్నపిల్లల పార్కులను సందర్శించారు. పార్కులో ఆట వస్తువుల కోసం రూ.40 లక్షల మేర ఖర్చు చేస్తున్నామని చెప్పారు. అలాగే..మున్సిపల్ పంప్‌హౌస్ లోపల పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించారు. మున్సిపల్ రామయ్య స్కూల్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

కౌతాళం: మండలంలోని కాత్రికి గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురై ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు ఉచ్చప్ప తన ఎద్దును ఉదయం విద్యుత్ స్తంభానికి కట్టేశాడు. అయితే శనివారం రాత్రి కురిసిన వర్షానికి స్తంభానికి ఎర్త్ రావడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై ఎద్దు మృతి చెందింది.

2న ఉచిత మెగా ఫెర్టిలిటీ శిబిరం

ఆదోని అర్బన్ : జూలై 2వ తేదీన ఉచిత మెగా ఫర్టిలైటీ క్యాంపు, జూలై 24న మూడో విడత ఉచిత కంటి ఆపరేషన్ మెగా క్యాంపు ఏర్పాటు చేస్తామని అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య హాస్టల్‌లో ఆదివారం ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం సెక్రటరీ మిరియాల శ్రీధర్ మాట్లాడుతూ శిబిరాల్లో అందరూ పాల్గొని సేవ చేయాలని కోరారు. వాటికి అయ్యే ఖర్చును తాను భరిస్తానని చెప్పారు. అనంతరం డాక్టర్ గంగాధర్‌రావు మాట్లాడుతూ తమ ఆస్పత్రి సౌజన్యంతో త్వరలో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. సభ్యులు రఘు, రాంప్రసాద్, ఈరన్నశెట్టి, రంగా, డా.రంజిత్, బ్యాంకు మేనేజర్లు నరసింహ, శివరామ్, మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు సంగీత, మమతశ్రీ పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం



వివరాలు సేకరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆదోని అర్బన్ : మండలంలోని కపటి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటుచేసుకొని గంధాల మోజేష్‌కు చెందిన గుడిసె దగ్ధమైంది. ప్రమాదంలో రూ.3 లక్షలు వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఆయన మాట్లాడుతూ తన భార్య ఆనందమ్మ పిల్లలకు తినుబండారాలు ఇప్పించడానికి బయటకు వెళ్లిన సమయంలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ జరిగిందని విలపించాడు. సుమారు 10 క్వింటాళ్ల పత్తి, మూడు తులాల బంగారం, రూ.లక్ష నగదు గుడిసెలో కాలిపోయాయని కన్నీరుమున్నీరయ్యాడు. అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేయగా ఈ లోపు మొత్తం కాలి బూడిదైంది.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

ఎమ్మిగనూరుటౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంబేడ్కర్ స్టడీ సర్కిల్ కో–ఆర్డినేటర్ బలరాముడు ఆదివారం తెలిపారు. ఇంటర్మీడియెట్ కోర్స్ పూర్తి చేసిన వారు అడ్మిషన్లు పొందడానికిఅవకాశం ఉందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు 73829 29823,73829 29823 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.